# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **కుప్పంలో పర్యటిస్తోన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చారు.**

**2.** **విభిన్న ప్రతిభావంతుల సమస్యలను మంత్రివర్గం సమావేశంలో చర్చిస్తామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు.**

**3.** **ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పించేందుకు ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర శాసన సభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.**

**4.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

**5.** **జాతీయ చిన్నతరహా పరిశ్రమల దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

చిత్తూరు జిల్లా కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు. కుప్పం మండలం పరమసముద్రంలో హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నిర్మించిన కుప్పం ఉప కాలువ వద్ద కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చారు. అనంతరం హంద్రీనీవా ద్వారా కుప్పం వరకు నీటిని తరలించిన విధానాన్ని తెలిపేలా ప్రదర్శించిన ఛాయా చిత్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, యువతకు నీటి సంరక్షణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

-------------------------

విభిన్న ప్రతిభావంతుల సమస్యలను మంత్రివర్గం సమావేశంలో చర్చిస్తామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు. విశాఖపట్నంలో పర్యటిస్తున్న ఉపముఖ్యమంత్రితో ఈరోజు విభిన్న ప్రతిభావంతులు సమావేశమై వారి సమస్యల గురించి తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులకు వ్యక్తిగత రేషన్ కార్డులు మంజూరు, సామాజిక పింఛన్ల పంపిణీలో తలెత్తుతున్న ఇబ్బందులు వంటి అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

-------------------------

ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పించేందుకు ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని

రాష్ట్ర శాసన సభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. నర్సీపట్నంల ప్రాంతీయ ఆసుపత్రిలో 47 లక్షల రూపాయలతో ఆధునీకరణ పనులను చేపట్టామని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో వైద్య సదుపాయాల కల్పన కోసం 72.50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశామని తెలిపారు. వీటి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లాలో జీడి రైతుల ఆర్థిక అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయంలో జీడిపప్పు రైతులు, కొనుగోలుదారులు, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో నిన్న జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పలాస ప్రాంత జీడిపప్పు.. కేంద్ర ప్రభుత్వ ఒక జిల్లా – ఒక ఉత్పత్తి పథకం క్రింద ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జీడి రైతులకు సులభ రుణ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్..32 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

జాతీయ చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు. చిన్న తరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి... యువతకు ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగు పరిచే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 30వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఆర్థికాభివృద్ధిలో చిన్న తరహా పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తున్నాయి. అందువల్లనే... చిన్న తరహా పరిశ్రమలకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా... వాటిని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది.

---------------------------

రాష్ట్రంలో ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంతో పాటు అసెంబ్లీ భవనంలో స్టీల్, గాజు సీసాల్లో తాగు నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ఆయన నిన్న ప్రాంభించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని, ఈ నేపథ్యంలో ఉద్యోగులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఈ ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో దివ్యాంగులు, ఆరోగ్య పింఛన్లకు సంబంధించి పునఃపరిశీలనకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ వచ్చే నెల ఒకటవ తేదీన పింఛన్లు ఇవ్వనున్నామని రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ – సెర్ప్ ఒక ప్రకటనలో

తెలిపింది.  ఆయా కేటగిరీలకు చెందిన పింఛన్లపై వైద్యారోగ్య శాఖ తనిఖీ నిర్వహించి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి నోటీసులు జారీ చేసింది. వీరిలో అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు సెర్ప్ పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలోని దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..18 సెకన్లు

---------------------------

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సెప్టెంబరు 9 నుంచి నవంబరు 19వ తేదీ వరకూ బిలాస్ పూర్–యలహంక వయా గుంతకల్లు మీదుగా  ప్రత్యేక  వారాంతపు రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక  ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ప్రతి మంగళవారం ఉదయం 11 గంటలకు బిలాసపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం యలహంకకు  చేరుతుందన్నారు. ఈ రైలు  తిరుగు ప్రయాణంలో ప్రతి బుధవారం ఉదయం రాత్రి 9 గంటలకు యల్హాంకలో బయలుదేరి శుక్రవారం ఐదున్నరకు బిలాసపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు రాష్ట్రంలోని  రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురరం, ధర్మవరం, హిందూపురం స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో  దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో  ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో  కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.  ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో సెప్టెంబరు 25 నుంచి 27వ తేదీ వరకు బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో పర్యాటక శాఖ అధికారులతో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ పర్యాటక దినోత్సవం  సందర్భంగా వచ్చే నెల 27 న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు  సూర్యలంక బీచ్ లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. బీచ్‌లో సెల్ఫీ పాయింట్లు, గాలిపటాలు ఎగరవేయటం, సాహసోపేతమైన కార్యక్రమాలు, లేజర్ షో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

---------------------------

యువత సామర్థ్యాల్ని తెలుసుకునేందుకు క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఎర్రన్న క్రీడోత్సవం' పేరిట సెప్టెంబర్ 19 నుంచి శ్రీకాకుళంలో 'ఎంపీ కప్ 2025' పోటీలు ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఏడు పెంకులాట, కర్రసాము, చదరంగం, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్ వంటి ఎనిమిది ప్రధాన, సంప్రదాయ క్రీడా పోటీలను శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు నమోదు చేసుకోవాలని సూచించారు.

======================